# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు
99086 89674 లో
సంప్రదించగలరు



హైదరాబాద్ | మంగళవారం,మే20,2025 | ఎడిటర్: పంథ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1


## అచ్చంపేటను ఆదర్శ నియోజకవర్గంగా

# తీర్చిదిద్దడమే లక్ష్యం..




### నల్లమల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రణాళిక

- పహల్గామ్ ఘటన అనంతరం దేశవ్యాప్తంగా అదే చర్చ జరిగింది
- రూ.12,600 కోట్లతో గిరిజన సంక్షేమ పనులు
- నల్లమల రైతులకు ఉచితంగా సౌర విద్యుత్ పంపుసెట్లు
- పోడు భూములను సాగులోకి తెచ్చేందుకు చర్యలు
- అచ్చంపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- - ఇందిరాగాంధీ గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసిన ఘనతను గుర్తు చేశారు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మే19,( పహల్గామ్ ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ దేశవ్యాప్తంగా జరిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసిన ఘనతను గుర్తు చేశారు. 50 ఏళ్లు గడిచినా ఇందిరాగాంధీ పేరును ప్రజలు తలుచుకుంటున్నారంటే ఆమె పాలన ఎంత గొప్పదో అర్థమవుతుందన్నారు. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు.నల్లమల ప్రాంత సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై 'నల్లమల డిక్లరేషన్'ను కూడా ఆయన ఆవిష్కరించారు.అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి, నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారు. ఒకప్పుడు వెనుకబాటుకు నిలయంగా ఉన్న నల్లమల ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి హోదాలో మాట్లాడటం గర్వకారణంగా ఉందని, తన గుండె ఉప్పొంగిపోతోందని ఆయన అన్నారు. తాను పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని సగర్వంగా చెప్పుకుంటానని, కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు.దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు నిర్మించాలన్నా ఒకప్పుడు పాలమూరు బిడ్డలనే పిలిచేవారని, వారు నిర్మించిన ప్రాజెక్టులే నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయని సీఎం గుర్తుచేశారు. నల్లమల ప్రాంత రైతులందరికీ ఉచితంగా సౌర విద్యుత్ పంపుసెట్లు అందిస్తామని, వంద రోజుల్లోగా సోలార్ విద్యుత్ మోటార్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.శిల్పారామం వద్ద మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు, దిగ్గజ కంపెనీలతో పోటీపడేలా స్టాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హులైన సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వారి ఆనందంలో పాలుపంచుకున్నానని, నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్నబియ్యం అందుతోందని పేర్కొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ ఆరోపణల ఖండన

- దాడికి ముందే పాక్‌కు సమాచారం ఇవ్వలేదని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ
- జైశంకర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించిందన్న కేంద్రం
- రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారమన్న బీజేపీ, పీఐబీ
- ఆపరేషన్ మొదలయ్యాకే సమాచారం ఇచ్చామని వివరణ




'ఆపరేషన్ సిందూర్' కు సంబంధించి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ఆపరేషన్ ప్రారంభానికి ముందే పాకిస్థాన్‌తో పాటు ఇతర దేశాలకు సమాచారం అందించారని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చెప్పినట్లుగా కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. ఇది పూర్తిగా అవాస్తవమని, వాస్తవాలను వక్రీకరిస్తున్నారని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన తొలి దశలోనే, అంటే ఆపరేషన్ మొదలైన తర్వాత, పాకిస్థాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలకు సమాచారం అందించినట్లు కేంద్రమంత్రి జైశంకర్ తెలిపారని విదేశాంగ శాఖ వివరించింది. అయితే, దాడికి ముందే ఈ సమాచారం బయటకు వెళ్లిందని, దీనివల్ల పాకిస్థాన్ అప్రమత్తమైందని కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రాహుల్ గాంధీ ఆరోపించడం పూర్తిగా నిరాధారమని పేర్కొంది. జైశంకర్‌పై రాహుల్ గాంధీ చేస్తున్నవి అసత్య ఆరోపణలని తెలిపింది.



## తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలు..

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం కారణంగా తెలంగాణ రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సోమ, మంగళవారాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది.నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

## తెలంగాణలో 77 మంది

# డీఎస్పీల బదిలీలు

- రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో పోలీసు అధికారుల బదిలీ
- మొత్తం 77 మంది డీఎస్పీలు, ఏసీపీలకు స్థానచలనం
- కొందరికి కొత్త పోస్టింగులు కేటాయింపు
- డీజీపీ జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ







రాష్ట్ర పోలీసు యంత్రాంగంలో సోమవారం భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. డీజీపీ జితేందర్ కీలక ఉత్తర్వులు జారీ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీ, ఏసీపీ స్థాయి అధికారులను బదిలీ చేశారు. ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా కొందరికి నూతన పోస్టింగులు కేటాయించగా, మరికొందరిని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.పోలీసు శాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన ఈ బదిలీల్లో పలువురు కీలక అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించారు.

## కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పుష్కర స్నానం ఆచరించిన బండి సంజయ్

- అందాల పోటీలకు రూ. 300 కోట్లు... పుష్కరాలకు రూ. 35 కోట్లేనా?
- పుష్కరాల ఏర్పాట్లకు రూ.35 కోట్లు చాలా తక్కువని విమర్శ
- యూపీలో కుంభమేళాను బీజేపీ ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాల్లో స్నానం చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానం ఆచరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంత పెద్ద పుష్కర పండుగకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 35 కోట్లు మాత్రమే విడుదల చేయడం ఏర్పాట్లకు ఏమాత్రం సరిపోదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు వస్తే, అక్కడి బీజేపీ ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి ఘనంగా నిర్వహించిందని బండి సంజయ్ గుర్తుచేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే, పుష్కరాలను కుంభమేళా తరహాలో కోట్లాది మంది భక్తులను తరలించి ఎంతో వైభవంగా నిర్వహించేవాళ్లమని ఆయన వ్యాఖ్యానించారు. "అందాల పోటీలకు రూ. 300 కోట్లు కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రూ.35 కోట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసం?" అని ఆయన ప్రశ్నించారు.పుష్కరాలను కేవలం ఈ ప్రాంతానికే పరిమితం చేయడం సరైన పద్ధతి కాదని, వచ్చే పుష్కరాలకైనా ఎక్కువ బడ్జెట్ కేటాయించి ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడంతో ఈ ప్రాంతానికి చెడ్డపేరు వచ్చిందని, కనీసం ఈ పుష్కరాల ద్వారానైనా మంచి పేరు రావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## శ్రీశైలం ఆలయం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పై సస్పెన్షన్ వేటు

- పది రోజుల క్రితం ఆలయానికి ఇతర మతస్థుల రాక
- వారి వద్ద లభ్యమైన అన్యమత పుస్తకాలు
- ఘటన వెలుగులోకి రావడంతో ఈవో చర్యలు



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) అయ్యన్నపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎస్. శ్రీనివాసరావు సస్పెన్షన్ వేటు వేశారు. సీఎస్ఓగా ఉద్యోగ బాధ్యతల పట్ల అయ్యన్న నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో ఈవో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.వివరాల్లోకి వెళితే, సుమారు పది రోజుల క్రితం, ఇతర మతాలకు చెందిన కొందరు వ్యక్తులు ఆలయ సందర్శన కోసం వచ్చారని తెలిసింది. ఆ సమయంలో వారి వద్ద అన్యమతానికి సంబంధించిన పుస్తకాలు ఉన్నట్లు క్యూ లైన్ల వద్ద భద్రతా సిబ్బంది గుర్తించారు. దీంతో సిబ్బంది వారిని అక్కడి నుంచి వెనక్కి పంపించారు. అయితే, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇతర మతస్థులు శ్రీశైలంలో కలకలం సృష్టించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, భద్రతాపరమైన అంశాల్లో సీఎస్ఓ అయ్యన్న నిర్లక్ష్యంగా ఉన్నారని భావించిన ఈవో శ్రీనివాసరావు, ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనపై తదుపరి విచారణ జరిపే అవకాశం ఉంది.

# లింగాలలో పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం..

**- రోడ్లపై మురుగు నీరు.. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం**
**- పట్టింపులేని అధికారులు, సిబ్బంది**

పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, మే 19:మండల పరిధిలోని లింగాల గ్రామంలో పారిశుద్ధ్యం లోపించి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తుండడంతో స్థానిక ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన వైనం. ఎన్నిసార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా కూడా పట్టించుకోవట్లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పలుచోట్ల డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో రోడ్లపైకి మురుగునీరు చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. రానున్నది వర్షాకాలం కావడంతో ఇలా నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారి తమకు ఎక్కడ మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాలు వస్తాయో అని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రత్యేక అధికారులు చుట్టపు చూపుగా గ్రామానికి వచ్చి పోతుండడంతో పారిశుధ్యం పైపులైన్ల మరమ్మతులు మృతి కాలువల పూడికతీత జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచులు ఉంటే తామవారికి సమస్యలు తెలిపిన వెంటనే పరిష్కరించేవారని ఇప్పుడు అధికారులు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి ఉందని ఉన్న అధికారులు పట్టించుకోవట్లేదు అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో పారిశుద్ధ సమస్యలు లేకుండా చూడాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



వీధుల్లో నిలిచిన మురుగునీరు



చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతోతో నిండిన డ్రైనేజీ

# క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం: డాక్టర్ స్రవంతి

పెన్ పహాడ్/ ప్రజా ముచ్చట, మే 19: క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని డాక్టర్ స్రవంతి అన్నారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అనంతారం గ్రామంలో నిక్షయ శివిర్-2 క్యాంపు నిర్వహించినారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నిక్షయ శివిర్-2 క్యాంపు లో భాగంగా 45 మంది నుండి స్పుటము నమూనాలను సేకరించి సి బి ఎన్ ఏ ఏ టీ ల్యాబ్ కు పంపడం జరిగిందనీ తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెన్ పహాడ్ పరిధిలో ఉచితంగా మందులు ఇవ్వబడును అని తెలిపారు. మందులు క్రమం తప్పకుండా వేసుకున్నచో ఆరు నెలల్లోనే వ్యాధి నయమగునని , నిర్లక్ష్యం చేస్తే వ్యాధి మరింత ముదిరి 18 నెలల చికిత్స అవసరం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ లు భూతరాజు శ్రీనివాసులు, టీ .చంద్రశేఖర్ రాజు, ఎంపీహెచ్ఎస్ భూతరాజు సైదులు, ఏఎన్ఎం లు టీ .దుర్గ, జే.



నాగలక్ష్మి, ఎం పి హెచ్ ఎ లు యం. రమేష్, పి.మధు, ఎల్ టి లింగాల రాజు, ఎస్ టి ఎస్ ఫ్రీన్సి, ఎస్ టి ఎల్ ఎస్ యం. వెంకన్న, ఆశా లు యం.సబితా, ఎస్ కె. జహంగీర్ బేగం , పి. రాధ, ఏ .లలిత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ప్రజా నాయకుడు సుందరయ్య: సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ

పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, మే 19: ఆదర్శ ప్రజా నాయకుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, జీవితాంతం పీడిత ప్రజల కోసం పోరాడిన ఆదర్శ నేత, సమాజ గమనాన్ని నిరంతరం అధ్యయనం చేసి ప్రజలలో పోరాట పటిమను పెంచిన అధ్యయన శీలి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40 వ వర్ధంతిని సిపిఎం పార్టీ లింగాల, అన్నారం , పెన్ పహాడ్ గ్రామ శాఖ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా పీడిత ప్రజల కోసం తన ఆస్తులు, భూములను దానం చేసి సమాజం కోసం పిల్లల్ని కూడా వద్దనుకున్న ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. చట్టబద్ధ పదవులను అనుభవించినప్పటికీ ఆడంబరాలకు పోకుండా సైకిల్ పైనే పార్లమెంటుకు వెళ్లి పేద ప్రజల సమస్యలను చట్ట సభలలో చర్చించిన మహోన్నత నేత సుందరయ్య అని గుర్తు చేసుకున్నారు. అగ్రకులంలో పుట్టినప్పటికీ వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి, సమాజంలో వస్తున్న మార్పులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న చట్టాలను అధ్యయనం చేసి ప్రజలను పోరాటాల్లోకి తీసుకువచ్చి వారిని చైతన్యం చేశారని అన్నారు. నీటి వనరులను వినియోగం, భూమిపై ఉన్న సహజ వనరులు ప్రజలందరివని సంపద వికేంద్రీకరణ





జరగాలని, దున్నేవాడికే భూమి ఇవ్వాలని ప్రజల కోసం భూ పోరాటాలు చేసిన మహోన్నత నేత సుందరయ్య స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక,రాజకీయ అసమానతలు లేని సమాజం కోసం చేసే పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శులు రణపంగ బుచ్చి రాములు, నరేష్, ఎస్.కె అబ్బారు, ప్రజా సంఘాల నాయకులు దుర్గయ్య, వెంకన్న, సైదులు, ధరావత్ జగపతి, గురువయ్య, బిక్షం, మధు, సైదులు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటా వీలునామాకు ఆయన ఆంతరంగికుడి ఆమోదం.. రూ.588 కోట్ల వాటాకు ఓకే

దివంగత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా వీలునామాకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. రతన్ టాటాకు అత్యంత సన్నిహితుడు, తాజ్ గ్రూప్ హెూటళ్ల మాజీ డైరెక్టర్ అయిన మోహినీ మోహన్ దత్తా, వీలునామాలోని షరతులకు అంగీకరించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం వెల్లడించింది. టాటా మిగులు ఆస్తిలో మూడో వంతు భాగాన్ని దత్తాకు కేటాయించారు. దీని విలువ సుమారు రూ. 588 కోట్లు ఉంటుందని అంచనా.మోహినీ దత్తా తన సమ్మతిని తెలియజేయడంతో, టాటా వీలునామా ఎగ్జిక్యూటర్లు బాంబే హైకోర్టు నుంచి ప్రొబేట్ (వీలునామా ధృవీకరణ) పొందే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి మార్గం సుగమమైంది. సుమారు ఇరవై మందికి పైగా ఉన్న లబ్ధిదారులలో, 77 ఏళ్ల దత్తా మాత్రమే తన వాటా విలువకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేశారు.రతన్ టాటా మిగులు ఆస్తిలో (స్థిరాస్తులు, షేర్‌హోల్డింగ్‌లు మినహా) మిగిలిన మూడింట రెండు వంతుల భాగాన్ని ఆయన సోదరీమణులు షిరీన్ జెజీభాయ్ (72), డయానా జెజీభాయ్ (70)లకు కేటాయించారు. వీరిద్దరూ వీలునామాకు ఎగ్జిక్యూటర్లుగా కూడా వ్యవహరిస్తున్నారు.తనకు దక్కాల్సిన వారసత్వ ఆస్తి విలువ విషయంలో ఎగ్జిక్యూటర్లతో దత్తా విభేదించినప్పటికీ, ఆయన వీలునామాను అధికారికంగా సవాలు చేయలేకపోయారు. వీలునామాలోని 'నో-కాంటెస్ట్ క్లాజ్' (వివాద రహిత నిబంధన) ఇందుకు కారణం. ఈ నిబంధన ప్రకారం, ఎవరైనా లబ్ధిదారుడు వీలునామా షరతులను వ్యతిరేకిస్తే, వారు తమ వాటాను కోల్పోయే ప్రమాదం ఉంటుందని సదరు కథనం పేర్కొంది.

# రాష్ట్రాలపై స్వారీకే రాష్ట్రపతి లేఖ

రాజ్యాంగపరమైన అనిశ్చిత పరిస్థితికి కారణమవుతున్న ఒక సుదీర్ఘ సమస్యపై అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన నిర్దేశం చేస్తే దాని అమలుకు చర్యలు తీసుకోవడం జరగాలి. నరేంద్ర మోడీ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. గవర్నర్ల పాత్రపై సుప్రీంకోర్టు ఆదేశాల అమలుకు బదులు అలా తీర్పునిచ్చే అధికారం ఉందా లేదా తేల్చమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా శరవేగంగా 14 ప్రశ్నలు సంధింపజేసింది. పేరుకు రాష్ట్రపతి రాసిందైనా ఈ వ్యవహారం మొత్తం కేంద్రం కనుసన్నల్లోనే జరిగింది. రాజ్యాంగపరంగా కూడా భారత రాష్ట్రపతి అలంకార ప్రాయమైన అధినేత మాత్రమే. ఏప్రిల్ 8వ తేదీన గవర్నర్ల విషయమై సుప్రీంకోర్టు తీర్పు రాగా ఆ మరుసటి రోజునే కేంద్రం దానికి ఎలా విరుగుడు చేయాలనే మంతనాలు ప్రారంభించింది. అటార్నీ జనరల్ ఆర్.వెంకట రమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇంకా న్యాయశాఖ ప్రతినిధులతో విస్తారంగా చర్చలు సాగించారు. చివరకు మే ఏడవ తేదీ నాటికి రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు సమర్పించే ప్రశ్నావళి ప్రస్తావనను ఖరారు చేశారు. మొదట ఈ తీర్పుపై సమీక్ష కోరాలా లేక మరింత విస్తృత ధర్మాసనం కోరాలా అని తర్జనభర్జనలు జరిపారు. రాజ్యాంగం 143(1) అధికరణం కింద రాష్ట్రపతి పేరిట సలహా కోరడమే ఉపయోగకరమని నిర్ణయానికి వచ్చారు. ఎందుకంటే రాష్ట్రపతి కోరిన అంశాన్ని పరిశీలించడానికి ఐదుగురు సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయటం పరిపాటి అయితే అసలు ఈ అంశంపై అభిప్రాయం చెప్పాలా వద్దా అని కూడా సుప్రీంకోర్టు తన నిర్ణయానికి తాను రావచ్చు. ఉదాహరణకు బాబ్రీ మసీదు/రామ జన్మభూమి వివాదంలో విధ్వంసం తర్వాత పి.వి.నరసింహారావు ప్రభుత్వం సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరింది. అయితే ఈ విషయంలో తాము అభిప్రాయం చెప్పగలిగింది లేదని, రాజకీయ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ధారించింది.గత ఉదాహరణలు1960లో సి జాబితాలోని రాష్ట్రాల ప్రతిపత్తిపై సూచనలు కోరింది కేంద్రం. పాకిస్తాన్‌తో ప్రాదేశిక భూభాగంపై ఒప్పందం చేసుకోవచ్చునన్న విషయం 1951లో సుప్రీంకోర్టు అభిప్రాయం కోరింది. 1978లో ఎమర్జెన్సీ తర్వాత ఆ అత్యాచార కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయవచ్చునా అన్న అంశంపై అభిప్రాయం కోరింది, వీటిపై చెప్పడం లేదా ఒకటి రెండుసార్లు నిరాకరించటం జరిగింది. రాజ్యాంగం 142 అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు మాత్రమే అందులోని నిబంధనల అమలుకు చెల్లుబాటుపై తుది మాట చెప్పవలసి ఉంటుంది. రాజ్యాంగ మౌలిక స్వభావం అన్న తీర్పు తర్వాత ఇది మరింత బలపడింది. అదే సమయంలో 143(1) అధికరణం రాష్ట్రపతికి సుప్రీంకోర్టు అభిప్రాయం కోరే అధికారం ఇస్తుంది. కాకపోతే ప్రస్తుతం ద్రౌపది ముర్ము పంపిన ప్రస్తావన కేవలం రాజ్యాంగ నిబంధనల అనువర్తింపుకే కాక రాజకీయ సంఘర్షణకు కూడా రాజ్యాంగ ప్రతిష్టంభనకు కూడా దారితీసే ప్రమాదం ఉంది.తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పది బిల్లులను అంతులేని జాప్యంతో అట్టి పెట్టుకోవడం సుప్రీంకోర్టు విచారించింది. తమ ముందుకు వచ్చిన బిల్లులపై మూడు మాసాలలోగా ఆమోదం లేదా నిరాకరణ చేయవలసి ఉంటుందని తేల్చి చెప్పింది. ఒకవేళ రాష్ట్రపతి పరిశీలనకు పంపేట్లయితే అప్పుడు కూడా మూడు మాసాల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించింది. దాంతో రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఎలా ఆదేశాలిస్తుందని దీనిపై చాలామంది అభ్యంతరాలు లేవనెత్తారు. ఇప్పుడు రాష్ట్రపతి పంపిన 143(1) ప్రస్తావన కూడా అలాంటి ప్రశ్నలే ముందుకు తెచ్చింది. రాజ్యాంగం 200, అధికరణం గవర్నర్ పరిధిని చెప్తుంది. 21వ అధికరణం శాసనసభ ఆమోదించిన బిల్లుల అంగీకారం ముద్ర గురించి చెప్తుంది. ఇందుకు సంబంధించి మరి ఏ విధమైన నిర్దేశాలు లేనప్పుడు మూడు మాసాలలోనే పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఎలా చెప్తుందనేది ప్రశ్నల సారాంశం.పెత్తనానికి పగ్గాలువాస్తవానికి చాలా మంది వాదిస్తున్నట్టు ఇక్కడ సుప్రీంకోర్టు రాష్ట్రపతి లేదా గవర్నర్‌లను ఏం చేయాలో ఏ విధంగా నిర్ణయం తీసుకోవాలో ఆదేశించలేదు. తమకు నచ్చిన నిర్ణయం తీసుకోవడానికి మూడు మాసాల వ్యవధి ఉండాలని మాత్రమే చెబుతున్నది. ఈ విధంగా చేయడం రాజ్యాంగ స్ఫూర్తిని నొక్కి వక్కాణించేదే కానీ అందుకు భిన్నంగా చెప్పింది కాదు. ఈ గడువు కూడా గతంలో ఇందిరా గాంధీ హయాంలో సర్కారియా కమిషన్, వాజ్‌పేయి హయాంలో పూంఛ్ కమిషన్ లకు ఆధ్వర్యం వహించిన మాజీ న్యాయమూర్తులు చెప్పిందే. ఇంతకంటే సూటిగా గతంలో రెండు మూడు సందర్భాల్లో ఉన్న అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రపతి విధివిధానాలపై నిర్దేశాలు ఇచ్చాయి. 1994లో ఎస్.ఆర్.బొమ్మై కేసులో రాష్ట్ర ప్రభుత్వాల రద్దు, రాష్ట్రపతి పాలన విధింపుకు సంబంధించి అప్పటివరకు జరిగిన ఏకపక్ష పోకడలకు సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. మరణశిక్ష పడిన ఖైదీల క్షమాభిక్ష దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవడానికి కూడా నిర్ణీత గడువును సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఆ తీర్పు తర్వాత అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవటం మనం చూశాం. అప్పుడెప్పుడూ లేని అభ్యంతరం ఇప్పుడే ఎందుకు వచ్చినట్టు!

# అంతటా దోపిడి అవుతున్న ఆమె శ్రమ

దేశంలోని తల్లులు రక్తలేమితో బాధపడుతున్నారు. నిజానికి కార్మిక రంగంలో వున్న మహిళల పట్ల చాలా నిర్లక్ష్యం కనిపిస్తున్నది. రైతు కూలీలు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకార, పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న స్త్రీలపై జరిగిన పరిశోధనలో వారు రక్తలేమితో మధ్య వయస్సులోనే వంగిపోయి, కీళ్ళు అరిగిపోయి, ప్రభుత్వాల నుండి యాజమాన్యాల నుండి ఎటువంటి సహాయం లేక పిల్లలకు పాలు కూడా ఇవ్వలేని స్థితిలో జీవిస్తున్నారు. గర్భవతులుగా వున్నప్పుడు కూడా కూలికి వెళ్ళకపోతే జరగక మురికి వాడల్లో వుంటూ పౌష్టికాహారం లేక పచ్చళ్ళు తింటూ జీవిస్తున్నారు. వ్యవసాయ రంగంలోనైతే నడి ఎండల్లో నాట్లు వేయడం, పగిలిన కాళ్ళతో కూడా బురదలో దిగి కలుపు తీయడం, మధ్యాహ్నానికి కళ్ళు తిరిగి పడిపోతున్నా అటు పాలకులు గాని ఇటు భూస్వాములు గాని మజ్జిగ కూడా ఇవ్వని దయలేని ప్రభుత్వంలో అభాగ్యంగా జీవిస్తున్నారు. ముఖ్యంగా చేనేత రంగంలో వున్న స్త్రీలు రక్తలేమితో బాధ పడుతున్నట్లుగా సర్వేలు చెపుతున్నాయి. మహిళల శ్రమ దోపిడీ గురించి మహిళా మేధావులు వ్యధాపూరితమైన విషయాలను ప్రపంచం ముందుకు తెస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదు.మహిళలు ఇంటా బయటా చాకిరీ చేస్తున్నారు. కాని కోట్లాది మంది మహిళల కోట్లాది గంటల శ్రమకి ఆర్థిక విలువ లేదు. గుర్తింపు లేదు. ఎవరైనా గృహిణిని 'మీరేం పని చేస్తారు?' అంటే 'నేనేమీ చెయ్యను!' అంటుంది. రోజంతా తను చేసే పనిని 'పని' కాదు అని చెబుతుంది. ఆమె కుటుంబం కూడా ఆమె పని చెయ్యదు అని చెబుతుంది. విరామం లేకుండా ఇంట్లో ఆమె చేసే చాకిరీకి ఎలాంటి విలువ లేదు. ఈ దేశంలో కోట్లాది మంది మహిళలు ప్రతి రోజూ చేసే పని అదృశ్యం అవుతుంది. కుటుంబానికే కాదు, ప్రభుత్వాలకూ కనబడదు. కొన్ని గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మహిళలు చేసే గృహ, సంరక్షణ శ్రమకు ఆర్థిక విలువ లెక్కించినట్లైతే అది కొన్ని బిలియన్ డాలర్ల విలువైనదిగా ఉంటుంది. అయినప్పటికీ ఈ శ్రమ ఎప్పుడూ ఆర్థిక లెక్కల్లోకి రాదు. దానికి కారణం తరతరాలుగా మహిళల శ్రమను సహజమైన బాధ్యతగా చూడడం. అంటే మహిళలు పుడుతూనే చీపుళ్ళు, చాటలు, గరిటెలు పట్టుకుని పుట్టినట్టు. ఇంటి పని మహిళలకు చాలా సహజమైనదనే ప్రచారం పితృస్వామ్య సమాజం చేసింది.భారత రాజ్యాంగం స్త్రీల కోసం, మహిళల రక్షణ కోసం వారి ఆర్థిక వెసులుబాటు కోసం, వారి విద్యాభివృద్ధి కోసం ఎన్నో చట్టాలు చేసింది. కాని చాలామంది కొడుకుతో సమానంగా కూతురుకి సమాన ఆస్తి ఇవ్వడంలేదు. అందువల్ల వాళ్ళు నిర్భాగ్యులుగా జీవించాల్సి వస్తుంది. గ్రామాల్లో కొడుకుతో సమానంగా కూతుర్ని చదివించటం లేదు. చివరకు కార్పొరేట్ స్కూళ్లలో కొడుకులను, గవర్నమెంటు స్కూల్‌లో కూతుళ్లను చదివిస్తుంటారు. ఇప్పుడు పదవ తరగతి పాసయిన ఆడపిల్లల్ని ఇంటర్మీడియట్‌లో చేర్చటం లేదు. వందల మంది ఆడపిల్లలకి బాల్య వివాహాలు జరుగుతున్నాయి. వాళ్ళు ఇంటర్‌కి వెళితే, ఊరు దాటి వెళితే ప్రేమలో పడతారనే అపోహతో తల్లిదండ్రులే వారిని నిరోధిస్తున్నారు. నిజానికి మనుస్మృతి చదవకపోయినా ఆ భావజాలం మాత్రం తండ్రుల మీద, భర్తల మీద బలంగా వుంది.దళిత వాడల్లో తాగుడు ఎక్కువై తల్లిని, భార్యను నిందిస్తున్నారు. తాగుడు కోసం భార్యను కొట్టి డబ్బు తీసుకుంటున్నారు. ఇంట్లో పిల్లలు చదువుకొనే వాతావరణం లేకుండా చేస్తున్నారు. కొన్ని ఇళ్ళలో స్త్రీలు పొయ్యి మీద కుండ పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. మరొకవైపు వ్యవసాయంలో పని దినాలు బాగా తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో కార్పొరేటు సంస్థలు రొయ్యలు బాగు చేయటం కోసం రాత్రి పూట 11 గంటల నుండి స్త్రీలను ఆటోల్లో పనులకు తీసుకొని వెళ్తున్నారు. అందుకు వాళ్ళకు అనేక జబ్బులు వస్తున్నాయి. పిల్లలకు ఆలన పాలన చూడలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వాలు వ్యవసాయ కూలీల జీవన వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాయి.బడుగు వర్గాల్లోనే కాదు. అన్ని వ్యవస్థల్లోను స్త్రీలు పురుష పెత్తనం కింద నలిగిపోతున్నారు. ఇదే అదనుగా మత వ్యవస్థలు, పాలకులు మత కులోన్మాదాలను ప్రోత్సహిస్తున్నారు. మత క్షేత్రాలను సందర్శించే యాత్రలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తి క్రమం నుండి ఆచార సాంప్రదాయాల్లోకి స్త్రీలను నెడుతున్నారు. నిజానికి ఇప్పుడు స్త్రీ మాతృత్వం మీద విపరీతమైన నిర్లక్ష్యం జరుగుతున్నది. ఎంతోమంది యువతులు ఉద్యోగాలు లేక, కట్న కానుకలు ఇవ్వలేక, పెళ్ళిళ్ళు గాక, ఒంటరి మహిళలుగా జీవిస్తున్నారు. ఇక భర్త చనిపోయిన, భర్తలు వలసలు పోయిన స్త్రీల మీద అరాచక శక్తులు దాడులు చేస్తున్నాయి. అసెంబ్లీలోనే వీటిపైన చర్చ జరుగుతుంది. ఒకపక్క గుట్కా, గంజాయి వంటి రకరకాల మత్తు పదార్థాలు, రకరకాల లిక్కర్లు ప్రతి వీధిలో దొరుకుతున్నాయి. ఇంటింటికి సరాఫరా చేసేవాళ్ళు కూడా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో స్త్రీ మాతృత్వాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం, విద్యా వ్యాపార, కార్మిక రంగాల్లో పనిచేస్తున్న స్త్రీలను శ్రమ దోపిడీ నుంచి రక్షించుకోవడం కోసం భారత రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన సందర్భం ఇది.

దేశంలోని తల్లులు రక్తలేమితో బాధపడుతున్నారు. నిజానికి కార్మిక రంగంలో వున్న మహిళల పట్ల చాలా నిర్లక్ష్యం కనిపిస్తున్నది. రైతు కూలీలు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకార, పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న స్త్రీలపై జరిగిన పరిశోధనలో వారు రక్తలేమితో మధ్య వయస్సులోనే వంగిపోయి, కీళ్ళు అరిగిపోయి, ప్రభుత్వాల నుండి యాజమాన్యాల నుండి ఎటువంటి సహాయం లేక పిల్లలకు పాలు కూడా ఇవ్వలేని స్థితిలో జీవిస్తున్నారు. గర్భవతులుగా వున్నప్పుడు కూడా కూలికి వెళ్ళకపోతే జరగక మురికి వాడల్లో వుంటూ పౌష్టికాహారం లేక పచ్చళ్ళు తింటూ జీవిస్తున్నారు. వ్యవసాయ రంగంలోనైతే నడి ఎండల్లో నాట్లు వేయడం, పగిలిన కాళ్ళతో కూడా బురదలో దిగి కలుపు తీయడం, మధ్యాహ్నానికి కళ్ళు తిరిగి పడిపోతున్నా అటు పాలకులు గాని ఇటు భూస్వాములు గాని మజ్జిగ కూడా ఇవ్వని దయలేని ప్రభుత్వంలో అభాగ్యంగా జీవిస్తున్నారు. ముఖ్యంగా చేనేత రంగంలో వున్న స్త్రీలు రక్తలేమితో బాధ పడుతున్నట్లుగా సర్వేలు చెపుతున్నాయి. మహిళల శ్రమ దోపిడీ గురించి మహిళా మేధావులు వ్యధాపూరితమైన విషయాలను ప్రపంచం ముందుకు తెస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదు.మహిళలు ఇంటా బయటా చాకిరీ చేస్తున్నారు. కాని కోట్లాది మంది మహిళల కోట్లాది గంటల శ్రమకి ఆర్థిక విలువ లేదు. గుర్తింపు లేదు. ఎవరైనా గృహిణిని 'మీరేం పని చేస్తారు?' అంటే 'నేనేమీ చెయ్యను!' అంటుంది. రోజంతా తను చేసే పనిని 'పని' కాదు అని చెబుతుంది. ఆమె కుటుంబం కూడా ఆమె పని చెయ్యదు అని చెబుతుంది. విరామం లేకుండా ఇంట్లో ఆమె చేసే చాకిరీకి ఎలాంటి విలువ లేదు. ఈ దేశంలో కోట్లాది మంది మహిళలు ప్రతి రోజూ చేసే పని అదృశ్యం అవుతుంది. కుటుంబానికే కాదు, ప్రభుత్వాలకూ కనబడదు. కొన్ని గణాంకాల